నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 19 జూలై 2024 | SANGAREDDY

కొందరికే రుణమాఫీ !

ప్రభుత్వ షరతులతో పథకానికి అనేక మంది రైతులు దూరం

- ఏవేవో నిబంధనలతో అర్హుల జాబితా కుదింపు
- గైడ్‌లైన్స్ తెలియక తలలు పట్టుకుంటున్న బ్యాంకర్లు, అధికారులు
- మాకు రుణమాఫీ వచ్చిందా...? అంటూ రైతుల ఆరా
- ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,53,168 మంది రైతులు లక్ష రూపాయల రుణం
- కేసీఆర్ హయాంలో షరతులు లేకుండా అమలు

చౌటకూరు మండలం తర్దాన్‌పల్లిలో రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్న రైతులు

సిద్దిపేట, జూలై 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా పంట రుణమాఫీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నది. రైతు వేదికల్లో సంబురాలు చేసుకుంటున్నది. కానీ, రైతుల్లో అసంతృప్తి అలుముకుంది. పంట రుణమాఫీ అమలులో ఏవేవో నిబంధనలు పెట్టి అర్హుల జాబితాను కుదించడంతో ఎంతో మంది రైతులకు రుణమాఫీ అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేస్తామంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తొలుత గత డిసెంబర్ 9నే చేస్తానని నమ్మబలికింది. ఆ తర్వాత తేదీలు మార్చుకుంటూ కాలయాపన చేసింది. తీరా ఆగస్టు 15 కల్లా మూడు విడతలుగా పంట రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ ప్రకటించారు. పంట రుణమాఫీ పథకానికి ఏవేవో నిబంధనలు రూపొందించి అర్హుల సంఖ్యను కుదించారు. కేంద్రం అమలుచేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిబంధనలను పంట రుణమాఫీకి వర్తింపజేస్తున్నారు. రేషన్‌కార్డు లేని వారికి పంట రుణమాఫీ వర్తిస్తుందా...? లేదా అనేది క్లారిటీ లేదు. దీంతో రేషన్‌కార్డు లేని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట రుణమాఫీ అమలు విషయంలో అటు అధికార యంత్రాంగ గానీ ఇటు బ్యాంకు అధికారులకు ఒక స్పష్టత లేకుండా పోయింది. తమకు పంట రుణమాఫీ అవుతుందా..? అని అధికారులను అడిగితే ఏమో అంటూ వారి నుంచి సమాధానం వస్తున్నది. రెండు రోజులుగా గ్రామాల్లోని వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న లిస్టులో రైతులు తమ పేరు వెతుక్కుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,53,168 మంది రైతులు

రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల వరకు పంట రుణమాఫీ చేశామని చెబుతున్న లెక్కల ప్రకారం ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,53,168 మంది రైతులు ఉన్నారు. వీరిలో సిద్దిపేట జిల్లాలో 53,137 మంది, మెదక్ జిల్లాలో 48,864 మంది, సంగారెడ్డి జిల్లాలో 51,167 మందికి పంట రుణమాఫీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. లక్ష రూపాయల వరకు పంట రుణమాఫీ చేశామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పారు. ఏ గ్రామంలో చూసినా వందల సంఖ్యలో రైతులు ఉంటే గ్రామానికి సరాసరిగా ఇరవై మంది కంటే ఎక్కువ ఆ లిస్టుల్లో పేర్లు లేవు. పంట రుణమాఫీ 12 డిసెంబర్ 2018 నుంచి 09 డిసెంబర్ 2023 మధ్యకాలంలో తీసుకున్న రైతులకు మాత్రమే వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. ఇదే విషయమై జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి చెబుతున్నారు. ఈమధ్య కాలంలో తీసుకున్న పంట రుణాలకు మాత్రమే అనే పదానికి ఇప్పటికీ స్పష్టత లేదు. ఈ విషయంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అంతకుముందు తీసుకొని ఏటా రెన్యువల్ చేయించుకున్న వారి సంగతి ఏంటి...? ఇలా ఎన్నో ప్రశ్నలు రైతుల్లో నెలకొన్నాయి. వీటికి స్పష్టత ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది అని చెప్పాలి. పట్టాదారు పాస్ పుస్తకం ఉండి పంట రుణం తీసుకున్న రైతుకు వర్తింప జేయాలి. అప్పుడే రైతులకు సంపూర్ణ న్యాయం జరుగుతుంది.

షరతులు లేకుండా రుణమాఫీ చేసిన కేసీఆర్

తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.లక్ష వరకు షరతులు లేకుండా పంట రుణమాఫీ చేసింది. ఎంతోమంది రైతులకు లబ్ధి చేకూరింది. చాలా మంది రైతులు బ్యాంకుల వద్ద తాకట్టుపెట్టిన పొలాలను విడిపించుకుని రుణ విముక్తులయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో 1,67,771 మంది రైతులకు, మెదక్ జిల్లాలో 1,53,883 మంది, సంగారెడ్డి జిల్లాలో 1,90.002 మంది రైతులకు పంట రుణమాఫీ జరిగింది. ఫలితంగా రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు చేయూత లభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులకు కష్టాలు మొదలయ్యాయి. వానకాలం పంటలు వేసుడు పూర్తి అవుతున్నప్పటికీ ఇంతవరకు రైతుభరోసా ఇవ్వకపోవడంతో అన్నదాతలు అప్పులు చేస్తున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు రంచన్‌గా రైతుబంధు వచ్చేది. ఇప్పుడు రైతులకు ఆ ధీమా కరువైంది.

సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో బావి వద్ద భోజనం చేస్తూమా పేరు రుణమాఫీ జాబితాలో లేదని చెబుతున్న రైతు రాజయ్య కుటుంబం

మా లోన్ మాఫీ చేయాలి

మేము వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. నాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మొత్తం పొలం పారుతుంది. మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న. 2021లో నారాయణరావుపేట ఆంధ్రా బ్యాంకులో రూ .40 వేలు పంట లోన్ తెచ్చుకున్నాం. మిత్తి కట్టుకుంటా రెన్యువల్ చేస్తున్నాం. ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ లిస్టులో మా పేరు లేదు. దయచేసి మా లోన్ ప్రభుత్వం మాఫీ చేయాలి. మా ఊర్లో కొందరికి అయింది. మాకు మాత్రం కాలేదు.

– ఒగ్గు లక్ష్మీరాజయ్య, లక్ష్మీదేవిపల్లి, సిద్దిపేట

రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు

నాకు 37 గుంటల భూమి ఉంది. దానిపైన 2021లో సిద్దిపేట బ్యాంక్ ఆఫ్ బరోడాలో 60 వేల రూపాయల క్రాప్ లోన్ తీసుకున్న. ప్రతి సంవత్సరం వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకుంటున్నా.ప్రభుత్వం చెప్పినట్టు రుణమాఫీ అవుతుందని అనుకున్న. కానీ, నిన్న ప్రభుత్వం విడుదల చేసిన లిస్ట్‌లో నా పేరు లేదు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ప్రభుత్వం మాలాంటి వారి రుణాలను సైతం మాఫీ చేయాలి. ఈ విషయంపై అధికారులను అడిగితే వచ్చే లిస్టులో వస్తది అంటున్నారు. వస్తదో రాదో తెలియక ఇబ్బంది పడుతున్నాం.

– అశోక్, రైతు, సిద్దిపేట

మాకు రుణమాఫీ రాలేదు

2017 నవంబర్ 9న నేను నా పేరున రూ.లక్షా 2 వేలు, నా సతీమణి జోగ్గారి సునంద పేరున రూ.50 వేల పంటరుణం తీసుకున్నం. 4 ఎకరాల భూమిపై ఇద్దరం కలిసి రూ.లక్షా 52 వేలు వరకు రుణం తీసుకున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ లిస్టులో రూ.50 వేల పంట రుణం తీసుకున్న నా సతీమణి జోగ్గారి సునంద పేరు రాలేదు. రుణమాఫీ అవుతదని ఎంతగానో ఎదురుచూశాం. సీఎం రేవంత్‌రెడ్డి మాలాంటి రైతులను మోసం చేసిండు.

– జోగ్గారి బాల్‌నర్సయ్య, రైతు, లింగుపల్లి, మిరుదొడ్డి మండలం

రైతుభరోసా కూడా ఇవ్వాలి..

పంట రుణమాఫీతో పాటు రైతుభరోసా వేస్తే మంచిగుండు. నాకు 4 ఎకరాల భూమిపై రూ.1.10 లక్షలు, నా కుమారుడు గుండిగారి రాజు రూ.50 వేలు పంట రుణాలను తీసుకున్నాము. నా కుమారుడికి రూ.50 వేలు రుణమాఫీ వచ్చింది. రెండో జాబితాలో నా పేరు వస్తుందేమో అనకుంటున్నా. అందరి పంట రుణాలు మాఫీ చేయాలి.

– గుండిగారి రాజయ్య, రైతు, లింగుపల్లి, మిరుదొడ్డి మండలం


సంగారెడ్డి జిల్లా డాకూర్ రైతు వేదికలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం

- మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, జూలై 18: రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మాఫీ చేస్తామని వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పంట రుణమాఫీ సంబురాల్లో భాగంగా మండలంలోని డాకూర్ రైతువేదికలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డితో రైతులను నేరుగా మాట్లాడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పంట రుణాలు మాఫీ చేస్తున్నామన్నారు. మొదటగా రూ. లక్ష లోపు రుణాలన్ని మాఫీ చేస్తామని, ఆగస్టు నెలఖరులోగా రూ. 2లక్షల రుణాలు సైతం మాఫీ చేస్తామన్నారు. రైతులెవ్వరూ అధైర్య పడొద్దని, ఏమైనా సాంకేతిక లోపాలతో రుణాలు మాఫీ కాకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులకు రుణమాఫీ జరిగేలా అధికారులు, బ్యాంకర్లు సహకరించాలని కోరారు. డాకూర్ రైతు వేదిక ఆవరణలో కలెక్టర్ క్రాంతితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పీర్ల పండుగలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, తహసీల్దార్ భాస్కర్, ఏడీఏ అరుణ , ఏవో విజయరత్న, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వినీత్ పాల్గొన్నారు.

సగం రైతులకు వర్తించని రుణమాఫీ

గజ్వేల్, జూలై 18: గజ్వేల్, ములుగు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, రాయపోల్, కొండపాక, ములుగు, వర్గల్, మర్కూక్, జగదేవ్‌పూర్ మండలాల్లో అధికారులు విడుదల చేసిన జాబితా ప్రకారం పరిశీలిస్తే గజ్వేల్ మండలంలో 2826, కొండపాక మండలంలో 2932, రాయపోల్ మండలంలో 2351, ములుగు మండలంలో 1582, మర్కూక్ మండలంలో 1543, వర్గల్ మండలంలో 2167, జగదేవ్‌పూర్ మండలంలో 2740 మంది రైతులు లక్షలోపు పంట రుణమాఫీ జాబితాలో ఉన్నారు. బ్యాంకుల్లో రైతులు తీసుకున్న రుణాల జాబితాను పరిశీలిస్తే అధికారులు ప్రకటించిన జాబితాకు రెట్టింపు సంఖ్యలో ఉంటారు. ప్రభుత్వం వడపోత తరువాత లక్షలోపు రుణాలు తీసుకున్న వారిని అర్హులుగా గుర్తించడంతో గజ్వేల్, ములుగు వ్యవసాయ డివిజన్‌లలో వేలాది మంది రైతులు పంట రుణమాఫీకి దూరమయ్యారు.

చాలామంది పేర్లు లేవు..

గజ్వేల్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో 2021లో రూ.78 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. తర్వాత ఏడాదికి రీ షెడ్యూల్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. లక్షలోపు రుణం తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. కొంతమందికి మాత్రమే రుణమాఫీ అయింది. నాలాంటి పేద రైతులకు రుణమాఫీలో అవకాశం కల్పించాలి. అధికారులు ప్రకటించిన జాబితాలో చాలామంది రైతుల పేర్లు లేకపోవడంతో నిరాశతో ఉన్నారు.

– బిందే రమేశ్‌గౌడ్, రైతు, రిమ్మనగూడ

హుస్నాబాద్ డివిజన్‌లో 10,359 రైతులకే రుణమాఫీ

- నాలుగు మండలాల్లో మొత్తం 54,739మంది రైతులు
- అయోమయంలో ఇంకా రుణమాఫీ కాని రైతులు
- సంబురాలకు రైతుల నుంచి స్పందన కరువు

హుస్నాబాద్, జూలై 18: హుస్నాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో మొత్తం 54,739 మంది రైతులు ఉండగా, ఇందులో కేవలం 10,359 మంది రైతులకు మాత్రమే మొదటి విడత రుణమాఫీ దక్కింది. ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నామంటూ ప్రకటించినప్పటికీ కొందరు రైతులకు అవి కూడా పడలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లక్షలోపు రుణం తీసుకున్న రైతుల పేర్లు కూడా కొందరివి జాబితాలో లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. మాకెప్పుడు రుణమాఫీ అవుతుందని అధికారుల వద్దకు వెళ్లి పడిగాపులు గాస్తున్నారు. సాంకేతిక కారణాల వల్ల జాబితాల్లో పేర్లు రాలేదని, మరో జాబితాలో పేరు వస్తుందని అధికారులు అంటున్నారని పలువురు రైతులు చెప్తున్నారు. మొదటి విడతలో రుణమాఫీ అయిన రైతులు సంబురపడుతుండగా, అన్ని అర్హతలు ఉండి కూడా వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతుల్లో ఆందోళన నెలకొంది. డివిజన్‌లోని నాలుగు మండలాల్లో కొందరు రైతులు పంటరుణాలు తీసుకోలేదు. పంటరుణం తీసుకున్న రైతుల్లో కేవలం ఇరవైశాతం మందికే రుణమాఫీ జరిగిందనేది నిపుణుల వాదన. రుణమాఫీ కాని రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని చెప్పొచ్చు. కాగా, గురువారం సాయంత్రం రైతు వేదికల్లో జరిగిన సంబురాల్లో రైతుల నుంచి అనుకున్నంత స్పందన లభించకపోవడం విశేషం. కొంతమంది రైతులకు రుణమాఫీ చేసి మరికొందరికి చేయక పోవడం, జాబితాలో పేరున్నా బ్యాంకు ఖాతాలో డబ్బులు పడినట్లు సమాచారం రాకపోవడంతో రైతులు సంబురాల్లో పాల్గొనేందుకు ముందుకు రాలేదు. మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం చేసిన మొదటి విడత రుణమాఫీపై ఎక్కువ మంది రైతులు పెదవి విరుస్తుండటం గమనార్హం.

దుబ్బాక ఏడీఏ పరిధిలో 13,146 మందికే..

దుబ్బాక, జూలై 18 :దుబ్బాక ఏడీఏ పరిధిలో దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, దౌల్తాబాద్ మండలాల్లో 40 వేల మంది రైతులు ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో కేవలం 13,1446 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రెండో విడతలో మిగిలిన రైతులకు రుణమాఫీ జరుగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం దుబ్బాక ఏడీఏ పరిధిలోని దుబ్బాక మండలంలో 4,694 మంది రైతులకు, మిరుదొడ్డి మండలంలో 3,521 మంది, తొగుట మండలంలో 1,970 మంది , దౌల్తాబాద్ మండలంలో 2,961 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. గ్రామాల్లో జాబితాల్లో చాలామంది రైతుల పేర్లు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక రైతువేదికలో గురువారం సాయంత్రం నిర్వహించిన పంట రుణమాఫీ సంబురాలను కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబురాలుగా మార్చేశారు. రైతువేదికలో రైతులకు బదులుగా కాంగ్రెస్ నాయకులు, తమ అనుచరులతో నిండిపోయారు. పంట రుణమాఫీపై గురువారం దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేర్వేరుగా సంబురాలు నిర్వహించారు. గురువారం ఉదయం శ్రవణ్‌కుమార్ రెడ్డి వర్గీయులు బస్టాండు వద్ద పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. సాయంత్రం చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రైతువేదికలో సంబురాల్లో పాల్గొని, బైక్ ర్యాలీతో బస్టాండు వద్ద సంబురాలు చేసుకున్నారు.

మా ఇంట్లో ఇద్దరికి కాలేదు..

కేసీఆర్ ఉన్నప్పుడు నాభార్య జీల రజిత పేరిట పంట రుణమాఫీ అయ్యింది. ఇప్పుడేమో నాభార్యతో పాటు నాకు కూడా రుణమాఫీ కాలేదు. ఆది అడిగేందుకే రైతు వేదికకు వస్తే ఇప్పుడు బిజీగా ఉన్న, ప్రస్తుతం మీటింగ్‌లో కూర్చోండి అంటూ ఏఈవోలు సమాధానం చెప్పుతున్నారు. ఏం చెయాలో అర్థం కావడం లేదు. గతంలో నా భార్య రజిత పేరిట విస్తీర్ణం 1.30 ఎకరాలకు తీసుకున్న రుణం రూ. 60 వేలు మాఫీ అయ్యాయి. నేడు కాంగ్రెస్ సర్కారులో మాఫీ జరగలేదు. నా పేరిట 1.20 ఎకరాల భూమి లోని పంట రుణాలకు రూ. 60 వేల లోన్ తీసుకున్నా. నాకు, నా భార్యకు ఇద్దరికీ కుటుంబంలో వేర్వేరుగా రూ. లక్ష లోపే రుణం ఉంది. కానీ, ఇద్దరిలో ఎవరికీ పంట రుణమాఫీ జరగలేదు. కాంగ్రెస్ సర్కారోళ్లు ఏం చెప్పుతున్నారో, ఏం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి నెలకొంది.

– జీల సదయ్య, రైతు, అక్కన్నపేట

రైతుబంధు ఎందుకు ఆపిండ్రు

నా పేరు మీద రెండు ఎకరాల ఏడు గుంటల భూమి ఉన్నది. గతంలో పంట సీజన్ రాగానే కేసీఆర్ సారు రైతుబంధు పైసలు వేసేవాడు. ఇప్పుడు పంటలు వేసి నెల రోజులు గడిచినా ఇంత వరకు రైతుబంధు రాలేదు. మాకు రైతుబంధు పైసలు ఇవ్వకుండా బ్యాంకుల్లో అప్పులు తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తున్నడు. మేము కూడా బయట అప్పులు చేసి పంటలను వేసినం. మరి మా పరిస్థితి ఏమిటీ. రైతుబంధు రాకుండానే పంటలు పండిస్తున్న రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి.

– చంద్రయ్య, వెంకటాపూర్, కోహీర్ మండలం

రూ.56 వేలకే రుణమాఫీ కాలే..

నాకు లక్ష్మీపూర్ గ్రామంలో 38 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఇండియన్ బ్యాంకులో తోటపల్లి బ్రాంచ్‌లో రూ. 56 వేల పంట రుణాన్ని 2019 సంవత్సరంలో తీసుకున్న. అప్పటి నుంచి ఏటా మిత్తి కట్టి తిరిగి రుణం తీసుకుంటున్న. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో పేరు రాలేదు. ప్రభుత్వం నాకు కూడా రుణమాఫీ చేయాలని కోరుతున్న. నాకు తక్కువ భూమి ఉన్న రుణమాఫీ కాకపోవడం విడ్డూరం.

– బోనగిరి దినేశ్, రైతు, లక్ష్మీపూర్, బెజ్జంకి మండలం

సగం మందికే చేసిండ్రు..

కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులకు కూడా సగం మాత్రమే రుణమాఫీ చేసింది. రూ.లక్ష రుణ మాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నది. కానీ, అందులో కొందరికి మాత్రమే రుణమాఫీ చేసింది. నేను ఏపీజీవీబీలో రూ.లక్ష రుణం తీసుకున్నా. రెన్యువల్ చేయిస్తున్నా. అయినా నాకు రుణమాఫీ కాలేదు. లిస్టులో నా పేరు రాలేదు. వెలిమెల గ్రామంలో నాలుగు ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం నాట్లు వేశాం. రుణమాఫీని కొందరికి చేసి కొందరికి చేయకుండా ఉండడం సరికాదు. అర్హులైన రైతులకు నామమాత్రంగా రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకోవడం కాంగ్రెస్ సర్కారుకు తగదు.

– కమ్మెట్ట ప్రభాకర్‌రెడ్డి, వెలిమెల, ఆర్సీపురం

మెదక్ జిల్లాలో రూ.241.82 కోట్లు మాఫీ

- లక్షలోపు రైతుల ఖాతాల్లో జమ
- మొదటి విడతలో 48,864 మంది రైతులకు లబ్ధి

మెదక్, జూలై 18 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో మొదటి విడతలో 48,864 మంది రైతులకు పంట రుణమాఫీ లబ్ధి చేకూరింది. రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు వారి ఖాతాల్లో రూ.241.82 కోట్లు జమ అయ్యాయి. రుణమాఫీ జాబితాలను గ్రామాల వారీగా వెల్లడించడంతో లబ్ధిదారుల లిస్ట్‌లో తమ పేరు ఉందో లేదోనని తెలుసుకుంటున్నారు. కొంత మంది రైతులకు గురువారం సాయం త్రం ఆరు గంటలైనా రుణమాఫీ మెసేజ్‌లు రాకపోవడంతో ఆందోళన చెం దారు. రూ.లక్షన్నర లోపు ఉన్న రైతుల రుణాలను ఈనెల 25 నుంచి 30 లోపు మాఫీ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. రూ.2 లక్షల్లోపు రుణాలను ఆగస్టు నెలలో మాఫీ చేయనున్నారు. రుణమాఫీ పొందిన రైతులు ఆయా రైతు వేదికల వద్ద సంబురాలు జరుపుకొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పంట రుణమాఫీ-2024 అమలుపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించా రు. అల్లాదుర్గం మండలంలో 1574 మంది రైతులు, చేగుంట మండలంలో 2801, చిలిపిచెడ్ మండలంలో 18 71, హవేళీ ఘనపూర్ మండలంలో 3044, కౌడిపల్లి మండలంలో 24 29, కొల్చారం మండలంలో 2496, మనోహరాబాద్ మండలంలో 10 27, మెదక్ మండలంలో 2205, నర్సాపూర్ మండలంలో 2690, నార్సింగి మండలంలో 1183, నిజాంపేట్ మండలంలో 1789, పాపన్నపేట మండలంలో 4209, రామాయంపేట్ మండలంలో 2613, రేగోడ్ మండలంలో1531, పెద్దశంకరంపేట మండలంలో 2532, చిన్నశంకరంపేట మండలంలో 3546, శివ్వంపేట్ మండలంలో 2526, టేక్మాల్ మండలంలో 2849, తూప్రాన్ మండలం లో 1419, వెల్దుర్తి మండలంలో 36 44 మంది రైతులు రుణమాఫీ పొం దారు.

అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి

- మండల కేంద్రాల్లో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు
- సొసైటీల ద్వారా జరిగే రుణమాఫీ వివరాలను ప్రతిరోజూ వెల్లడించాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- పంట రుణమాఫీపై బ్యాంకర్లు, అధికారులతో రివ్యూ

అధికారులతో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 18 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో అర్హులైన ప్రతి రైతుకు పంట రుణమాఫీ వర్తించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారును ఆదేశించారు. పంట రుణమాఫీపై బ్యాంకర్లతో గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో జిల్లాలో లక్ష రూపాయల్లోపు రుణం తీసుకున్న 45882 మంది రైతులకు రూ.241.82 కోట్ల రుణాల సొమ్మును ప్రభుత్వం గురువారం జమ చేసిందని, సంబంధిత రైతులకు రుణమాఫీ సొమ్ము చేరేలా బ్యాంకులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మొదటి దశలో జరుగుతున్న రుణమాఫీ లబ్ధిదారుల జాబితా, పూర్తిస్థాయి లబ్ధిదారుల జాబితాతో లీడ్ బ్యాంకు మేనేజర్ బ్యాంకు వారీగా రీకన్సైల్ చేయాలని, లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు పూర్తిస్థాయిలో బ్యాంకులు సమాచారం అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. 12 డిసెబర్ 2018 తేదీన లేదా ఆ తర్వాత మంజూరైన లేక రెన్యువల్ అయిన రుణాలకు 09 డిసెంబర్ 2023 తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ సహకార సంఘాల బ్యాంకుల ద్వారా రైతులు చేసిన రుణాలను సైతం ప్రభుత్వం మాఫీ చేస్తుందని, ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ సొమ్ము వినియోగంపై, ఫెయిల్డ్ ట్రాన్సాక్షన్ వివరాలు ప్రతిరోజూ రిపోర్టును అధికారులు అందజేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన సొమ్ము సాఫీగా రైతులకు చేరేలా చూడాలని, ప్రతి మండల కేంద్రంలో బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి రుణమాఫీకి సంబంధిత వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, ఎల్‌డీఎం నరసింహమూర్తి, బ్యాంకు కంట్రోలర్స్, బ్యాంక్ మేనేజర్లు, కోఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, జూలై 18: కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే షరతులు లేకుండా పంట రుణాలు మాఫీ చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయని గురువారం ఆయన ప్రకటనను విడుదల చేశారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి హామీలు ఇచ్చి, తెల్లరేషన్‌కార్డు ఇతర అంశాలు ప్రామాణికంగా ప్రకటించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు షరతులు ఎందుకు పెట్టిందని ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, రైతు పెట్టుబడి సాయం, అన్నదాతలకు ఏటా రూ.12వేల సాయం తదితర హామీల సంగతేంటని ఆయన ప్రశ్నించారు. ధరణి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, కాంగ్రెస్ కళ్లబొల్లి మాటలు, మోసాలను రైతులు, ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో గుణపాఠం చెబుతారన్నారు.

భక్తి మార్గమే ముక్తికి సోపానం

- మాధవానంద సరస్వతీ స్వామి
- ఘనంగా పాండురంగాశ్రమం ఉత్సవాల ముగింపు

మర్కూక్, జూలై 18 : భక్తి మార్గమే ముక్తికి సోపానమని, ప్రజలంతా దైవాన్ని కొలవాలని పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. వారం రోజులుగా మర్కూక్‌లోని భవానందపూర్ గ్రామ పాండురంగాశ్రమంలో ఆషాఢ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం ముగింపు ఉత్సవాల్లో మాధవానంద స్వామి పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన భోజనశాలలో అన్నపూజ నిర్వహించి, భక్తులకు సందేశమిచ్చారు. నాదం సాదం అనే సిద్ధాంతం ప్రకారం పాండురంగాశ్రమం కొనసాగుతో తెలిపారు. భవానందపూర్‌లోని పాండురంగాశ్రమం తెలంగాణ పండరిపురంగా ప్రస